

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 14 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు · 7లో

ఉమ్మడి అభ్యర్థి కొణతాలకు మద్దతు

▸▸ యాదవ సంక్షేమ సంఘం తీర్మానం

కూటమి ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ

పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయింపు

- తెరపైకి రోజుకో పేరు
- రేసులో రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్
- మాధవ్, విశ్వనాథరాజు, విజయలక్ష్మి ప్రయత్నాలు
- ఒకటి, రెండు రోజుల్లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం
- అనకాపల్లి అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం
- వైసీపీ అభ్యర్థి ఎంపికపై వేచి చూసే ధోరణిలో అధిష్ఠానం



సీఎం రమేశ్



పీవీఎన్ మాధవ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి ఎంపీ స్థానానికి కూటమి అభ్యర్థి ఎవరన్నదానిపై రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు సామాన్య ఓటర్లు కూడా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. పొత్తులో భాగంగా అనకాపల్లి లోక్‌సభ సీటును భారతీయ జనతా పార్టీకి కేటాయించిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి పోటీ చేయడానికి పలువురు ఆసక్తి చూపుతుండడంతో రోజుకో పేరు తెరపైకి వస్తున్నది. నియోజకవర్గం పరిధిలోని వ్యక్తికి అవకాశం కల్పిస్తారా? లేకపోతే వేరే ప్రాంతానికి చెందిన నేతను బరిలోకి దించుతారా? అన్నదానిపై ఇంతవరకు స్పష్టత లేదు.

బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ఒకటి, రెండు రోజుల్లో ఢిల్లీలో సమావేశం కానున్నదని, అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ జిల్లా నాయకులు చెబుతున్నారు. అయితే టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర నాయకత్వాలు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై కసరత్తు పూర్తి చేసినట్టు బీజేపీ జిల్లా నేతలు చెప్పుకుంటున్నారు. ఢిల్లీలో జరగనున్న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో అధికారికంగా ప్రకటించడమే మిగిలివుందని అంటున్నారు.

ఆశావహులు ఢిల్లీలో మకాం

అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశిస్తున్న కొంతమంది బీజేపీ నేతలు ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. కాగా రాజ్యసభ సభ్యుడు, కడప జిల్లాకు చెందిన సీనియర్ నేత సీఎం రమేశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఆయనకే టికెట్ ఖరారయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది. అయితే గుంటూరు జిల్లాకు చెందిన మరో రాజ్యసభ సభ్యుడు కూడా అనకాపల్లి నుంచి పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు తెలిసింది. వాస్తవంగా టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీ పొత్తు లేకముందు విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయాలని ఆయన భావించారు. అయితే పొత్తులో భాగంగా విశాఖ నుంచి తమ అభ్యర్థి పోటీ చేస్తారని టీడీపీ గట్టిగా పట్టుబట్టడంతో, ప్రత్యామ్నాయంగా అనకాపల్లి స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. కాగా స్థానికులకు అవకాశం కల్పించాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ... మిగతా 8వ పేజీలో

చీపురుపల్లికి గంటా



- 'భీమిలి'పై ఇంకా రాని స్పష్టత
- టికెట్ కోసం తీవ్ర పోటీ
- రేస్‌లో కర్రోతు బంగార్రాజు, బైరా ఫౌండేషన్ ఎండీ...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. అదే భీమునిపట్నం. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అక్కడి నుంచి పోటీ చేయాలని భావించారు. పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన్ను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని ఆదేశించింది. అక్కడ అధికార పార్టీ వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ బరిలో ఉన్నారు. ఆయనపై గంటాను పోటీకి నిలపాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అయితే చీపురుపల్లి దూరం అవుతుందని, భీమిలిలో పోటీ చేస్తానని గంటా తన మనసులో మాట వెల్లడించారు. తాము పక్కాగా సర్వే చేయించామని, మంచి మెజారిటీతో గెలుపు ఖాయమని చంద్రబాబునాయుడు స్పష్టంచేయడంతో చీపురుపల్లి నుంచి పోటీకి గంటా శ్రీనివాసరావు సిద్ధమైనట్టు తెలిసింది. విజయంతో తిరిగి వస్తానని చెప్పినట్టు సమాచారం. దీంతో చీపురుపల్లి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావేనని స్పష్టత వచ్చేసింది. అయితే ఇక్కడ భీమిలి నుంచి టీడీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారనే అంశంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కర్రోతు బంగార్రాజు ఏర్పాట్లు చేసుకోగా పొత్తుల్లో భాగంగా ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించగా, అక్కడి నుంచి లోకం మాధవిని పోటీకి దించింది. దాంతో బంగార్రాజు భీమిలి సీటు అడుగుతున్నారు. భీమిలి టీడీపీ ఇన్‌చార్జిగా కోరాడ రాజబాబు ఉన్నారు. టికెట్ కోసం ఆయన శతవిధాలా యత్నిస్తున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ సీటు కోసం యత్నించిన బైరా ఫౌండేషన్ ఎండీ దిలీప్ చక్రవర్తి...ఆ సీటు బీజేపీకి ఇచ్చేశారని తెలిసి, తాను భీమిలి వెళతానని అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. భీమిలి సీటు ఒక్కటే ఖాళీగా ఉండడంతో దాని కోసం చాలామంది చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇస్తుందో చూడాలి.

దక్కని దీవెన





విద్యార్థులపై ఫీజు భారం

- జగనన్న విద్యా దీవెన పథకం కింద ఏడాదికి నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటన
- ఈ ఏడాది ఒక దఫా మాత్రమే విడుదల
- అది కూడా కొంతమందికి ఇప్పటికీ జమ కాని వైనం
- మూడు విడతలు పెండింగ్
- అవి కడితేనే పరీక్షలకు అనుమతిస్తామంటున్న కళాశాలల యాజమాన్యాలు
- వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం 'జగనన్న విద్యాదీవెన' పథకం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఏటా నాలుగు విడతల్లో ఫీజు మొత్తం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత ఫీజును ఈ నెల ఒకటో తేదీన విద్యార్థి, తల్లి జాయింట్ ఖాతాకు జమ చేసింది. ఇంకా మూడు విడతలు పెండింగ్ ఉంది. ఇటుచూస్తే విద్యా సంవత్సరం చివరికి వచ్చేసింది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ఇప్పట్లో ప్రభుత్వం ఫీజులను చెల్లించే అవకాశం లేదని భావిస్తున్న కళాశాలల యాజమాన్యాలు... బకాయిలు (మూడు విడతల ఫీజు) చెల్లించాల్సిందిగా విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి.

ఎన్నికల తరువాత ఏ ప్రభుత్వం వస్తుందో, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విధానపరంగా ఎటువంటి తీసుకుంటుందోననే ఉద్దేశంతోనే కళాశాలల యాజమాన్యాలు... ప్రస్తుతం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. గడిచిన నెల రోజులు నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ తరహా ఇబ్బందులను ఎదుర్కొంటుండగా, ప్రస్తుతం డిగ్రీ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు చదివే విద్యార్థులకు కూడా కాలేజీల నుంచి ఫీజుల విషయంలో ఒత్తిడి మొదలైంది.

విశాఖపట్నం జిల్లాలో సుమారు 44 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి కోర్సులు చదువుతున్నారు. అనకాపల్లి జిల్లాలో 39,773 మంది వివిధ కోర్సులు చదువుతుండగా, వీరిలో సుమారు పది వేల మంది ఫైనలియర్ చదువుతున్నారు. అలాగే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12,457 మంది వివిధ కోర్సులు చదువుతున్నారు. వీరందరికీ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంకా మూడు విడతల ఫీజును ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. విశాఖ నగర పరిధిలోని ఓ ప్రముఖ కాలేజీలో ఏడాదికి ఫీజు రూ.67,700. ప్రభుత్వం నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత మొత్తాన్ని సీఎం ... మిగతా 8వ పేజీలో



ఎలమంచిలి పట్టణం కొత్తపేట పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

- జిల్లాలో తొలి రోజు 21,801 మందికి 21,657 మంది హాజరు
- డీఈవో వెంకట లక్ష్మమ్మ

అనకాపల్లి రూరల్, మార్చి 18: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 108 కేంద్రాల్లో తొలి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి 21,801 మంది హాజరు కావాల్సి ఉండగా 21,657 మంది (99.31 శాతం' హాజరైనట్టు ఆమె వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులు 21,259 మందికిగాను 21,177 మంది హాజరుకాగా, 82 మంది పరీక్షకు గైర్హాజరైనట్టు తెలిపారు. 542 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా, 480 మంది రాశారని, 62 మంది గైర్హాజరయ్యారని డీఈవో పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.11
సహారి (బుధ)	4.48



గరుడాద్రిపై వేంకటేశ్వరస్వామి నిజరూపం (ఫైల్)

ఉపమాకలో గరుడాద్రిపై వేంకటేశ్వరస్వామి ఆలయం, దిగువున క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయ గాలిగోపురం

నేటి నుంచి ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు

నక్కపల్లి మండలం ఉపమాకలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం ధ్వజారోహణం. రాత్రి 9 గంటలకు ఎదురు సన్నాహ మహోత్సవం, అర్ధరాత్రి రథోత్సవం, తదుపరి స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. 28వ తేదీ రాత్రి పుష్పయాగోత్సవాలతో ఉత్సవాలు ముగుస్తాయి. - 7లో

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి
- సామాజిక, మతపరమైన కార్యక్రమాలను నిర్వహించొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాలీలు, బహిరంగ సభల నిర్వహణకు పోలీసులు, సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో ప్రచార సభలు, సమావేశాలు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌కు ముందు ప్రారంభించిన అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించుకోవచ్చని, అయితే కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకూడదన్నారు. ఎన్నికల ప్రచారంలో సామాజిక, మతపరమైన కార్యక్రమాలను నిర్వహించ కూడదని, ఏ ఒక్క వర్గాన్ని ప్రభావితం చేసేలా ఉపన్యాసాలు, ప్రకటనలు చేయరాదన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో పొందవచ్చని తెలిపారు. ప్రైవేటు స్థలాలు, నివాసాలు, గోడలపై ఎన్నికల ప్రచార పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకుంటే సదరు యజమాని నుంచి రాతపూర్వకంగా అనుమతి తీసుకొని ఎన్నికల అధికారికి సమర్పించాలని సూచించారు. పోస్టర్లు, కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్‌తోపాటు వీటిని ప్రింట్ చేయించిన వారి వివరాలు, సంఖ్య తప్పనిసరిగా ముద్రించాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు బుద్ద నాగజగదీశ్వరరావు (టీడీపీ), గొర్లె సూరిబాబు (వైసీపీ), కేవీ సత్యనారాయణ (కాంగ్రెస్), కొల్లి రామ్ (ఆమ్ ఆద్మీ), శేషగిరి (బీజేపీ), డీఆర్‌ఓ దయానిధి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- పలు శాఖల అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశం

అనకాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, ఆదాయ పన్ను, సమాచార శాఖలు సమన్వయంతో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎస్పీ కేవీ ... మిగతా 8వ పేజీలో

గోవాడ షుగర్స్‌లో మళ్లీ చోరీ

ఫ్యాక్టరీ స్టోర్ రూమ్ తాళాలు విరగ్గొట్టిన ఆగంతకులు

- 400 కిలోల గన్‌మెటల్ అపహరణ
- బయటి దొంగలకు.. ఇంటి దొంగలు సహకారం?
- కొరవడిన నిఘా, సీసీ కెమెరాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- స్థానిక నేతల ఒత్తిళ్లతో నీరుగారుతున్న పోలీస్ కేసులు



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ స్టోర్‌రూమ్ వద్ద క్లూస్ టీమ్

చోడవరం, మార్చి 18: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ స్టోర్స్‌లో మళ్లీ దొంగలు పడ్డారు. తాళాలు విరగ్గొట్టి సుమారు 400 కిలోల గన్‌మెటల్‌ను అపహరించకుపోయారు. విరగగొట్టిన తాళాల స్థానంలో వేయడానికి కొత్త తాళాలు తీసుకుని వచ్చి, వాటిని అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయారు. చోరీకి గురైన గన్‌మెటల్ విలువ సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఉంటుందని అంచనా. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని ఫ్యాక్టరీ అధికారులు, పోలీసులు భావిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం ఫ్యాక్టరీకి వచ్చిన సిబ్బంది.. స్టోర్ రూము తాళాలు విరిగిపోయి ఉండడం గమనించి లోపలికి వెళ్లి పరిశీలించారు. స్టోర్‌లో నిల్వ చేసిన గన్‌మెటల్ కనిపించకపోవడంతో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఎండీ వి.సన్యాసినాయుడు స్టోర్స్‌ను పరిశీలించిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

ఇంటి దొంగల పనే!

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గడచిన కొంతకాలంగా విడిభాగాలు, ఇతర విలువైన మెటీరియల్‌ను దొంగలు ఎత్తుకుపోవడం సర్వసాధారణంగా మారింది. చోరీని వృత్తిగా ఎంచుకున్న గోవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు, ఫ్యాక్టరీకి చెందిన కొంతమంది సిబ్బందితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు కార్మికులు భావిస్తున్నారు. గత ఏడాదే కూడా ఫ్యాక్టరీ స్టోర్ రూమ్‌లో గన్‌మెటల్ చోరీకి గురైంది. మరోసారి దిగువ స్థాయి సిబ్బంది, ఫ్యాక్టరీలో బ్రాస్ మెటీరియల్ పైపును కత్తిరించి ఎత్తుకుపోయారు. ఫ్యాక్టరీలో తరచూ చోరీలు జరగడం వెనుక ఇంటి దొంగల హస్తం ఉందని కార్మికవర్గాలు అంటున్నాయి.

కొరవడిన నిఘా

ఫ్యాక్టరీలో తరచూ దొంగతనాలు జరిగి విలువైన సామాగ్రి అపహరణకు గురవుతున్నప్పటికీ నిఘాను పెంచడంలో అధికారులు విఫలం అయ్యారని కార్మికులు, సభ్య రైతులు ఆగ్రహం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ కాలువలో పడి బధిర బాలుడి మృతి

- తోటి విద్యార్థులతో బహిర్భూమికి వెళ్లిన క్రమంలో ప్రమాదం
- కశింకోట మండలం ఎచ్చర్ల వద్ద తేలిన మృతదేహం



పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తున్న తల్లిదండ్రులు



అట్టా తరుణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, మార్చి 18: మండలంలోని తామరం గ్రామంలో ఓ ప్రైవేటు విద్యా సంస్థలో ఒకటో తరగతి చదువుతున్న బధిర బాలుడు తోటి విద్యార్థులతో ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ ఏలేరు కాలువలో కొట్టుకుపోయాడు. ఆ బాలుడి మృతదేహం సోమవారం సాయంత్రం కశింకోట మండలం ఎచ్చర్ల గ్రామం వద్ద తేలింది. దీనికి సంబంధించి ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని తామరం గ్రామంలో గల ఇమ్మాన్యుయేల్ ఎడ్యుకేషన్ సంస్థ పాఠశాలలో సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన అట్టా తరుణ్‌కుమార్(7) అనే బధిర బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు తోటి విద్యార్థులతో కలిసి ఆ బాలుడు పాఠశాలను ఆనుకుని ఉన్న ఏలేరు కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. శుభ్రం చేసుకునేందుకు కాలువలోకి దిగగా ప్రమాదవశాత్తూ తరుణ్‌కుమార్ కాలుజారి కొట్టుకుపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే పాఠశాల యాజమాన్యానికి ఈ విషయం చెప్పారు. దీంతో రాత్రి 12 గంటలకు బాలుడి తల్లిదండ్రులకు యాజమాన్య ప్రతినిధులు ఫోన్ చేసి తరుణ్‌కుమార్ కనిపించడం లేదని సమాచారం ఇచ్చారు. బాలుడి తల్లిదండ్రులు సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయని అనుమతించలేదు. దీంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కింద కేసు నమోదు చేశారు. అయితే సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో కశింకోట మండలం ఎచ్చర్ల గ్రామం ఏలేరు కాలువలో ఓ బాలుడి మృతదేహం ఉందంటూ సమాచారం రావడంతో అక్కడున్నవారిని ఫొటోలు తీసి పంపమని పోలీసులు చెప్పారు. ఆ ఫొటోలో ఉన్నది తరుణ్‌కుమార్‌గా తల్లిదండ్రులు గుర్తించారు. మాటలు రాని తమ కుమారుడిని చదువుకునేందుకు ఇక్కడికి పంపితే మృతదేహంగా కనిపించాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆరోపించారు. బాలుడి తండ్రి పెంటారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, మార్చి 18: మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గుర్తుపట్టలేని విధంగా ముఖం ఛిద్రమైందని, ఎవరైనా వ్యక్తులు అదృశ్యమైతే వారి కుటుంబ సభ్యులు ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌లో సంప్రతించాలని ఆయన సూచించారు.

సెప్టిక్ ట్యాంకు గోతిలో పడి కార్మికుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 18: అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో నిర్మాణంలో వున్న సెప్టిక్‌ట్యాంక్ గొయ్యిలో పడి ఒక కార్మికుడు మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మూలపేట గ్రామంలో బొడ్డి సంఘమేశ్ ఇంటిని నిర్మిస్తున్నారు. దీంట్లో భాగంగా సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన కార్మికుడు తోట శేషు(43) ప్రమాదవశాత్తూ ట్యాంకు గోతిలో పడ్డాడు. తలకు, మెడకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి



మృతుడు గోవిందరావు (ఫైల్ ఫొటో)

కొత్తూరు, మార్చి 18: అనకాపల్లి మండలం కేఎస్ఆర్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సుంకర గోవిందరావు (49) శ్రీనగర్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కేఎస్ఆర్‌పేట వద్ద ఎడమ వైపు ఉన్న ఆటోను తప్పించే క్రమంలో అదుపు తప్పి కుడి వైపున వెళ్తున్న లారీ వెనుక చక్రాల కిందపడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

డిబ్రుగర్ -కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంపు

విశాఖపట్నం, మార్చి 18: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ మీదుగా డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల (22504/22503) ఫ్రీక్వెన్సీ పెంచుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రస్తుతం వారానికి నాలుగు రోజులు నడుస్తున్న ఈ సర్వీసులను ఈనెల 22వతేదీ నుంచి వారానికి ఐదు రోజులపాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. దీంతో 22504 నంబరు గల డిబ్రుగర్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రతి మంగళ, గురు, శుక్ర, శని, ఆదివారం...తిరుగు ప్రయాణంలో 22506 నంబరు గల కన్యాకుమారి-డిబ్రుగర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26వ తేదీ నుంచి ప్రతి సోమ, మంగళ, బుధ, గురు, శని వారం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఉమ్మడి అభ్యర్థి కొణతాలకు మద్దతు

- యాదవ సంక్షేమ సంఘం తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు, హాజరైన యాదవులు

అనకాపల్లి టౌన్, మార్చి 18: అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు తాము మద్దతు తెలుపుతున్నట్టు యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోడి వెంకటరావు చెప్పారు. సోమవారం గొల్లవీధిలోని జరిగిన యాదవ సామాజికవర్గం ఆత్మీయ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్టు ఆయన వెల్లడించారు. అనకాపల్లి నియోజకవర్గంలో 35 వేలకు పైగా యాదవ సామాజికవర్గ ఓట్లు ఉన్నాయని, రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం తామంతా కూటమి కొణతాల రామకృష్ణ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యాదవ సంఘం ప్రతినిధులు భరణికాన శ్రీనివాసరావు, పల్లా సత్య అప్పారావు, గోకివాడ లోవకృష్ణ, బొబ్బిలి గోవింద్, ఒమ్మి కోటేశ్వరరావు, పక్కుర్తి సత్తిబాబు, రేఖా రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

- ఉపమాకలో రేపు రాత్రి రథోత్సవం, కల్యాణవేడుక
- 28వ తేదీన పుష్ప యాగోత్సవాలతో ముగింపు



కొండపై స్వామి వారి నిజరూపం



ఆలయం లోపల ఏర్పాటు చేసిన పెండాల్స్

నక్కపల్లి, మార్చి 18: మండలంలోని ఉపమాకలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 19వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఉపమాక ఆలయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి సేవలు, ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ నెల 28వ తేదీ రాత్రి పుష్పయాగోత్సవాలతో ఉత్సవాలు ముగుస్తాయి. కల్యాణోత్సవాల్లో స్వామివారిని దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కొండపైన గుడికి వెళ్లే మెట్ల మార్గంలో రెయిలింగ్ మరమ్మతు పనులు పూర్తి చేశారు. కింద ఆలయంలో భక్తులకు ఎండ తీవ్రత లేకుండా పెండాల్స్ వేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం ఎదురుగా భారీ రేకుషెడ్డు, టెంట్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల పనులు పూర్తయ్యాయి. కల్యాణోత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం ఉదయం వరకు స్వామివారు స్వర్ణాభరణాలంకృతుడై ఉభయదేవేరులతో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ మండపంలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. ఈ సందర్భంగా మాడవీధుల్లో సాయంత్రం కావడి ఊరేగింపు, రాత్రి 10 గంటలకు అశ్వవాహనంపై స్వామివారి తొలి తిరువీధి సేవ జరుగుతుందని తెలిపారు. కాగా నర్సీపట్నం డీఎస్పీ పర్యవేక్షణలో నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్ల నుంచి 150 మంది పోలీస్ సిబ్బందిని ఉపమాక వెంకన్న కల్యాణోత్సవానికి బందోబస్తు నిమిత్తం వినియోగించనున్నారు.

ఉత్సవ వివరాలు..

- **19వ తేదీ:** సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, కంకణధారణ, రాత్రి 10 గంటలకు అశ్వవాహనంపై తిరువీధి సేవ
- **20వ తేదీ:** ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పెద్ద పల్లకీలో తిరువీధి సేవ, అష్టదిక్పాలకుల ఆవాహనం, మధ్యాహ్నం ధ్వజారోహణం. రాత్రి 9 గంటలకు ఎదురు సన్నాహ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు రథోత్సవం, తదుపరి స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం.
- **21వ తేదీ:** సర్వ దర్శనాలు, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై తిరువీధి సేవ
- **22వ తేదీ:** నిత్యహోమాలు, భక్తుల దర్శనాలు
- **23వ తేదీ:** సదస్యం (పండిత సభ), రాత్రికి పుణ్యకోటి వాహనంపై స్వామివారి ఊరేగింపు
- **24వ తేదీ:** సాయంత్రం సీహెచ్ఎల్‌పురం సమీపాన స్వామివారి తోట ఉత్సవం, రాత్రి 9 గంటలకు ఇత్తడి గజ వాహనంపై తిరువీధి సేవ
- **25వ తేదీ:** మహాపూర్ణాహుతి, చక్రస్నానం, డోలోత్సవం, మధ్యాహ్నం రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ, అనంతరం రాజయ్యపేట వద్ద సముద్ర తీరంలో చక్రస్నానం.
- 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు స్వామివారి పుష్పయాగోత్సవాలు, విశేష పూజలు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద అలంకరణ

19 నుంచి వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలు



గిరిజాంబగిరిపై శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట, మార్చి 18: వడ్డాది వేంకటేశ్వరస్వామి 151వ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 19వ తేదీ రాత్రి ప్రారంభం కానున్నాయి. ఆ రోజు రాత్రి 10 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. 25వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయని దేవాలయ ధర్మకర్త దొండా కన్నబాబు తెలిపారు. కల్యాణోత్సవాల్లో ప్రత్యేకంగా బస్సులు నడపాలని అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల అధికారులను కోరామన్నారు.

బ్యాంకులు, ప్రింటింగ్ ప్రెస్‌లపై నిఘా

- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో భాగంగా బ్యాంకులు, ప్రింటింగ్ ప్రెస్‌లపై నిఘా వుంటుందని, అందువల్ల అన్ని బ్యాంకుల అధికారులు, ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రింటింగ్ ప్రెసుల్లో ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లలో ప్రింట్ చేయించిన వారి పేరు, ప్రింటర్ పేరు, ప్రింట్ చేసిన కాపీల సంఖ్య తప్పనిసరిగా వుండాలన్నారు. రెండు కాపీలను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి, కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి తేడాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. అనుమానాలు ఏమైనా ఉంటే కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులను కలుసుకొని తెలుసుకోవాలని సూచించారు.

ఎన్నికల కోడ్ అమలులో వున్నంత కాలం ఎక్కువ మొత్తంలో నగదు జమ లేదా ఉపసంహరణ జరిగిన ఖాతాల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తేవాలని బ్యాంకర్లకు సూచించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతా తెరవాలన్నారు. అభ్యర్థులు లేదా వారి కుటుంబ సభ్యుల పేరున లావాదేవీలు జరిగినా సమాచారం కూడా అందజేయాలని సూచించారు. సమావేశానికి లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమానులు హాజరయ్యారు.

మహిళలపై భౌతిక దాడులను ఎదుర్కొనాలి

- డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు



ప్రసంగిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 18: మహిళలు తమపై జరుగుతున్న భౌతిక దాడులను సమర్థంగా ఎదుర్కోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు సూచించారు. వర్సిటీలో సోమవారం 'సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా' నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిస్థితులకు అనుగుణంగా ఎలా స్పందించాలో మార్షల్ ఆర్ట్స్‌లో మెలకువలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. మార్షల్ ఆర్ట్స్ ప్రత్యేక నిపుణులు ఎస్.కిశోర్‌కుమార్.. విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, సీడబ్ల్యూసీఎల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఫ్యాకల్టీ మెంబర్ భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రెండు రోజులైనా తొలగించని వైసీపీ రంగులు

- అచ్యుతాపురం మండలంలో సరిగా అమలుకాని కోడ్
- పట్టించుకోని అధికారులు



అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ ఆవరణలో వైసీపీ జెండా రంగులతో వున్న స్టేజీ

అచ్యుతాపురం, మార్చి 18: మండలంలో ఎన్నికల నియమావళిని అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదు. ప్రభుత్వ, పబ్లిక్ ఆస్తులపై రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, బొమ్మలు, రంగులు, పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు, హోర్డింగులు వంటి వాటిని తొలగించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. మండలంలో ఒకింత ఆలస్యంగా అయినా చాలావరకు వీటిని తీసివేయించిన అధికారులు, కొన్నిచోట్ల ప్రభుత్వ కట్టడాలకు వేసిన వైసీపీ జెండా రంగులను మాత్రం తుడిచివేయలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఆవరణలో ఉన్న స్టేజీకి గతంలో వైసీపీ జెండా తరహాలో పైన ఆకుపచ్చ, మధ్యలో తెలుపు, దిగువున నీలం రంగులు వేయించారు. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎంఈఓ, స్త్రీశక్తి, పీహెచ్‌సీ, ఎంఈఓ, హౌసింగ్, గ్రంథాలయ శాఖ భవనాలన్నీ ఇక్కడే వుంది. నిత్యం ఆయా కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వందలాది మంది వచ్చిపోతుంటారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రెండు రోజులు దాటినప్పటికీ స్టేజీకి వేసిన వైసీపీ రంగులను మాత్రమే అధికారులు తొలగించలేదు.

14 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



మాధవనగరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న పాత సమాచార హక్కు చట్టం బోర్డును మార్చాలని ఆదేశిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, మార్చి 18: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 14 మంది సచివాలయ సిబ్బంది షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు నాతవరం ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. సోమవారం ఆయన నాతవరం మండలంలోని వల్లంపేట, డి.యర్రవరం, వైడీపేట, నాతవరం పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన కటౌట్లు, బ్యానర్లు తొలగించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించామన్నారు. గ్రామాల్లో పర్యటించనున్నట్టు ముందురోజే సమాచారం ఇచ్చినప్పటికీ కొంతమంది సిబ్బంది గైర్హాజరు అయ్యారన్నారు. దీంతో 14 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అలాగే మాదవనగరం గ్రామంలో ఆయన పర్యటించి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పాత సమాచార హక్కు చట్టం బోర్డును వెంటనే మార్చాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

అటవీ భూముల్లో చెట్లు తొలగించి ఆక్రమణ



రెండు రోజుల క్రితం చెట్లకు నిప్పు పెట్టిన దృశ్యం

గొలుగొండ, మార్చి 18: మండలంలోని గొలుగొండ అటవీ బీటు పరిధి పాతమల్లంపేట పంచాయతీ శివారు కొత్తపాలెం, అంటిమానుజోర్లు గ్రామాల వద్ద ధారకొండపై తుప్పలు, చెట్లకు కొందరు నిప్పుపెట్టి భూమిని ఆక్రమించుకుంటున్నారు. సుమారు ఆరు ఎకరాల్లో ఆక్రమణలు చోటుచేసు కుంటున్నాయి. అయితే వారం రోజుల క్రితం ఇద్దరిపై గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అటవీశాఖాధికారులు చెబుతున్నారు. కానీ అటవీ భూముల పరిరక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై గొలుగొండ అటవీ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌ను సంప్రతించగా ధారకొండపై చెట్లు, తుప్పలను తొలగించడాన్ని గుర్తించామన్నారు. ఇద్దరిపై గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

మర్రిపాలెం చెక్‌పోస్టును సందర్శించిన అదనపు ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ

సబ్బవరం, మార్చి 18: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అత్యంత అప్రమత్తంగా ఉంటూ, వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట సీఐ పిన్నింటి రమణ, ఎస్.ధనుంజయ్ వున్నారు.

బందోబస్తుపై ఎస్పీ ఆరా



ఉపమాక ఉత్సవాల బందోబస్తుపై సీఐలకు సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

నక్కపల్లి, మార్చి 18: ఉపమాకలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు సంబంధించి పోలీసు శాఖ పరంగా బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ సోమవారం సాయంత్రం ఇక్కడకు వచ్చి ఆరా తీశారు. ఉపమాక ఆలయానికి వచ్చే అన్ని మార్గాలను పరిశీలించారు. వీఐపీలు వచ్చినప్పుడు సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఐలు విజయ్‌కుమార్, అప్పన్నలను ఆదేశించారు. స్వామివారి రథోత్సవం, ఎదురుసన్నాహోత్సవ సమయాల్లో రోప్ పార్టీలు తప్పనిసరిగా వుండాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల నిలుపుదలకు స్థలాలను కేటాయించాలని చెప్పారు. ఆయన వెంట నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు తదితరులు వున్నారు.

జంగులూరులో కేంద్రం బృందం

- పౌర సదుపాయాలు, అభివృద్ధి పనులు పరిశీలన



జంగులూరులో పర్యటిస్తున్న అధికారుల బృందం

అచ్యుతాపురం, మార్చి 18: కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అధికారుల బృందం సోమవారం మండలంలోని జంగులూరు పంచాయతీలో పర్యటించింది. జంగులూరులో అభివృద్ధి కార్యక్రమాలపై 'గ్రామ పంచాయతీ ప్లాన్ 2024-25'ను స్థానిక అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు. పారిశుధ్యం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు అవసరమని స్థానికులు చెప్పారు. ఈ పర్యటనలో కేంద్ర అధికారులు ఉమరవ్ మాల్ యాదవ్, యోగేంద్ర కుమార్ మీనా, శివం టోమర్‌తోపాటు డీపీవో శిరీషారాణి, డీఎల్‌పీఓ మూర్తి, ఎంపీడీఓ సురేశ్‌కుమార్, సర్పంచ్ కూండ్రపు సత్యారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద

తుమ్మపాల, మార్చి 18: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, ఈ దఫా ఎన్నికల్లో వైసీపీని గద్దె దించాలని ప్రజలంతా కృతనిశ్చయంతో ఉన్నారని, ఆదివారం చిలకలూరిపేట వద్ద జరిగిన ప్రజాగళం మహాసభ విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరు కాదని, ఇవి రెండూ ఒకే కుటుంబానికి చెందినవన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

కాంగ్రెస్‌కి పూర్వ వైభవం : జగతా



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్

పాయకరావుపేట, మార్చి 18 : ఏపీలోని కాంగ్రెస్ పార్టీకి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నేతృత్వంలో పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభ విజయవంతమైందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోవాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి నారాయణచక్రవర్తి, నాయకులు మెర్ల సింహాచలం, ప్రగడ చక్రరావు, మారుతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

అచ్యుతాపురం, మార్చి 18: మండలంలోని దొప్పెర్ల, మడుతూరు, చీమలాపల్లి, కొండకర్ల ఆవ, రాజాన పాలెం, దోసూరు, తంతడిలో కేంద్ర బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఎస్ఐ నారాయణరావుతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు


పార్టీలో చేరిన వారితో విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 18: మండలంలోని మల్లపంచాయతీ నరేంద్రపురానికి చెందిన 20 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు రావి వెంకటరమణ, ప్రస్తుత వార్డు మెంబర్ కిల్లాడి వెంకటరావుతో సహా 20 మందికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపురం మాజీ సర్పంచ్ కరెడ్ల సూర్యప్రకాష్, బోజ లోకేష్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్లు వితరణ


ఫ్యాన్లు, లైట్లు, చార్జింగ్ లైట్లు అందజేస్తున్న లాల్‌కృష్ణ

పరవాడ, మార్చి 18: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహానికి రాంకీ ఫౌండేషన్ పది ఫ్యాన్లు, ఐదు ట్యూబ్‌లైట్లు, ఐదు చార్జింగ్ లైట్‌లను సమకూర్చింది. వీటిని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ పీపీ లాల్‌కృష్ణ సోమవారం వసతిగృహం మ్యాట్రిన్ సుజాతకు అందజేశారు. భవిష్యత్తులో వసతిగృహానికి కావాల్సిన ఇతర సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్షి, లైజింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కోలాటం పోటీల విజేత పరవాడ


పరవాడ బృందానికి నగదు అందిస్తున్న అప్పలనాయుడు

సబ్బవరం, మార్చి 18: మండలంలోని తవ్వవానిపాలెం పరదేశిమాంబ జాతర సందర్భంగా పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కోలాటం పోటీల్లో పరవాడ సీతారామ కోలాటం బృందం మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో వరసగా శ్రీరామపట్నంకు చెందిన జైశ్రీరామ్ కోలాటం బృందం, శ్రీకాకుళం జిల్లా కుర్లాంకు చెందిన శ్రీ తిరుమల శ్రీనివాస బృందం, అంకుపాలెం శ్రీఅభయాంజేయ కోలాటం బృందం నిలిచాయి. వీరికి మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వనం దేముడుబాబు, బోకం కాసుబాబు, బండారు చిన్నంనాయుడు, రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా ఆదిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన పరదేశమాంబ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం పోటీలు ఆలరించాయి. కార్యక్రమంలో పెద్దలు కటాన రాము, కొటాన అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు, గొర్లి లక్ష్మి, కనకం, కోటయ్య, ఆదిరెడ్డి రమణ, పోతురాజు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, మార్చి 18 : సమిద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు సోమవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ఎటువంటి వత్తిడి, భయం లేకుండా పరీక్షలు రాయడంపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ రూపొందించిన బ్రోచర్‌ని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సమిద సంస్థ రిసోర్స్‌పర్సన్స్ డాక్టర్ పింకి, రమణ, సతీష్‌కుమార్, నాగేశ్వరరావు, అశ్వని పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా శివప్రసాద్


నియామక పత్రం అందుకుంటున్న శివప్రసాద్

పాయకరావుపేట, మార్చి 18 : బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పాయకరావుపేటకు చెందిన ఇందుగపల్లి శివప్రసాద్ నియమితులయ్యారు. సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు ఈ మేరకు నియమకపత్రాన్ని శివప్రసాద్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్ధాపతుల చిట్టిబాబు, ఆరుగుల కొండబాబు, కుందేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసైనికులు చేయూత


రమణను పరామర్శిస్తున్న మత్తి కార్తీక్

ఎస్. రాయవరం, మార్చి 18: మండలంలోని గోకులపాడు గ్రామానికి చెందిన శానాపతి రమణ ఒక ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుపడి మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం రమణ అనారోగ్యానికి గురై నెల రోజుల నుంచి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న జనసేన మండల ఉపాధ్యక్షుడు మత్తి కార్తీక్, పలువురు జనసైనికులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రమణను పరామర్శించారు. కార్తీక్ ఆధ్వర్యంలో గోకులపాడు జనసేన కార్యకర్తలు కలిసి రూ.23,500 నగదును అందజేశారు. కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసు, ప్రగడ ప్రసాద్, రమణబాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

అనకాపల్లి టౌన్, మార్చి 18: క్షయ వ్యాధిపై పట్టణంలోని గొల్లవీధి యూపీహెచ్‌సీ డాక్టర్ జీకే నాగేంద్ర, సీహెచ్. ధాత్రిప్రియ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ నివారణ అధికారి డాక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీలో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీతానగరం నల్లమారమ్మతల్లి పండగ

కొత్తూరు, మార్చి 18 : అనకాపల్లి మండలం సీతానగరంలో మంగళవారం నల్లమారమ్మతల్లి పండగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో బాలనాగమ్మ పౌరాణిక నాటకం ప్రదర్శించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్పీ కేవీ మురళీకృష్ణ


అనకాపల్లి గవరపాలెం హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు


అనకాపల్లిలో పరీక్షా కేంద్రం నుంచి వస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ


అనకాపల్లి పట్టణ బాలికోన్నత పాఠశాల నుంచి వస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 18 : అనకాపల్లి పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. పట్టణ పరిధిలోని 12 పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఎనిమిది గంటలకే చేరుకున్నారు. పట్టణంలోని భాష్యం, బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య విద్యాసంస్థలతోపాటు కొప్పాక పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ తనిఖీ చేశారు. అలాగే జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ జేఎంజే, బాలికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పీటీడీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు వెళ్లారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

కోటవురట్లలో.. మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 207 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు.. బాలికల ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులకు పది మంది గైర్హాజరయ్యారు. పాములవాక జడ్పీ హైస్కూల్‌లో 100 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

పాయకరావుపేటలో.. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలను 1,722 మంది విద్యార్థులు రాశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, శ్రీప్రకాష్, కనోసా, శ్రీచైతన్య స్కూల్‌తోపాటు, ఎస్.నర్సాపురం, పాల్తేరుల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ కేఎస్.గాంధీ తెలిపారు.

నక్కపల్లిలో.. మండల కేంద్రంలో సోమవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక జడ్పీ హైస్కూల్, గురుకులంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ఈ పరీక్షా కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఎస్.రాయవరంలో.. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు 1081 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 11 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో ఏఎస్ఎస్ఏఎస్ మూర్తి తెలిపారు.

సబ్బవరంలో.. మండల కేంద్రంలోని ఐదు పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు సోమవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రావలమ్మపాలెం జడ్పీ హైస్కూల్‌ను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, స్క్వాడ్ జి.సాయి శైలజ పరిశీలించారు. సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్, ప్రతిభ విద్యాలయం, మదర్ స్కూల్, సన్‌రిడ్జ్ పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు 939 మంది విద్యార్థులకుగాను 928 మంది హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో-1 ఎల్. లక్ష్మణరావు తెలిపారు.

ఎలమంచిలిలో.. పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ స్కూలు, శ్రీచైతన్య స్కూల్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థినీ, విద్యార్థులు హాల్ టిక్కెట్ నంబర్లను సరిచూసుకున్నారు. పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 922 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

పరవాడలో.. మండల వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు తొలిరోజు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు 1,271 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా.. ఏడుగురు పరీక్షకు హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర్ధగంట ముందే చేరుకున్నారు. ఎంఈవో ఎం. దివాకర్ రావు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించారు. విద్యార్థులను ప్రధాన ద్వారం వద్ద సిబ్బంది తనిఖీ చేసి లోపలకు పంపించారు. ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి.

రాంబిల్లిలో.. మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు నాలుగు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. మొత్తం 607 మంది విద్యార్థులకుగాను 604 మంది హాజరయ్యారు. రాంబిల్లి, దిమిలిలోని మూడు సెంటర్లలో ముగ్గురు విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


నక్కపల్లి గురుకులం వద్ద వేచి ఉన్న టెన్త్ విద్యార్థులు


ఎలమంచిలి బాలికల ఉన్నత పాఠశాలలో నంబర్లను చూస్తున్న విద్యార్థినులు

జగన్ ఇంటి దారి పట్టడం ఖాయం

» బీజేపీ నేతల ఆత్మీయ సమావేశంలో అనిత

నక్కపల్లి, మార్చి 18: చిలకలూరిపేట ప్రజాగళం సభ ఊహించిన దానికంటే విజయవంతం కావడంతో ఇక జగన్ ఇంటిదారి పట్టడం ఖాయమని తేలిపోయిందని పాయకరావుపేట సెగ్మెంట్ ఉమ్మడి అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. సోమవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో కూటమి అభ్యర్థి అనితతో నియోజకవర్గ బీజేపీ నాయకులంతా కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనూ,కేంద్రంలోనూ ఎన్‌డీఏ కూటమి ఏర్పాటు తథ్యమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు కేంద్రం ప్రతీ నెలా ఇస్తున్న ఉచిత బియ్యాన్ని, అనేక పథకాలను జగన్‌ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నాయని చెప్పారు. ఈ ప్రచారాలను బీజేపీ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోసూరి శ్రీనివాస్, రవిరాజు, పోలినాటి నానాజీ, టీడీపీ నాయకులు వెంకటేశ్, వినోద్‌రాజు, లాలం కాశీనాయుడు, అబద్ధం, కొప్పిశెట్టి బుజ్జి,పెంకులరాజు, మీగడ సత్తిబాబు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుకుంటున్న టీడీపీ, బీజేపీ నాయకులు

కూటమి ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు తెలిసింది. వీరిలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, మహిళా మోర్చా నాయకురాలు తోట విజయలక్ష్మి, ఈర్లె శ్రీరామ్మూర్తి, డాక్టర్ విక్రమ్, తదితరులు వున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

వేచి చూసే ధోరణిలో వైసీపీ

రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు, 24 పార్లమెంట్ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించామని చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలు.. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేయలేదో చెప్పడంలేదు. ఇటీవల ఇడుపులపాయలో నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించినప్పుడు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి పేరు చెప్పకుండా 'బీసీ' అంటూ దాటవేశారు. దీంతో మళ్లీ తనకు అవకాశం వుంటుందని సిట్టింగ్ ఎంపీ సత్యవతి భావిస్తున్నారు. కానీ ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి లేదా మంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిపై స్పష్టత వచ్చిన తరువాత, సామాజిక సమీకరణలను అనుసరించి తమ అభ్యర్థిని ప్రకటించాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

దక్కని దీవెన

... 5వ పేజీ తరువాయి

ఒకటో తేదీన విడుదల చేసింది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి... మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. యాజమాన్యాల ఒత్తిడి భరించలేక ఇంజనీరింగ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో దాదాపు 50 శాతం మంది ఫీజులను చెల్లించేశారు. కొన్ని యాజమాన్యాలు ఫీజులు చెల్లించేంత వరకూ కాలేజీలకు రావద్దని బహిరంగంగానే చెబుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా కొంతమందికి తొలి విడత సొమ్ము కూడా ఇంకా జమ కాలేదు. 20 శాతం మంది విద్యార్థులకు అందాల్సి ఉందని చెబుతున్నారు.

'వసతి దీవెన' నిల్

స్కాలర్‌షిప్ మొత్తాన్ని రెండు విడతల్లో జగనన్న వసతి దీవెన కింద చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో విడత పది వేలు చొప్పున రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ ఒక్క విడత కూడా వసతి దీవెన మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయలేదు. ఇంకా చెప్పాలంటే...గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి వందలాది మందికి వసతి దీవెన నిధులు అందలేదు. అధికారులను అడుగుతున్నా స్పందన లేదని పలువురు చెబుతున్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గతంలో విధానాలను అమలు చేయాలని విద్యార్థులు చెబుతున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి


అధికారులతో సమీక్షిస్తున్న రవి పట్టన్‌శెట్టి

మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విభాగాల బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో ఉదాసీనంగా వ్యవహరించవద్దని కోరారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి రిపోర్టును ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంసీసీ, ఎంసీఎంసీ, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ మొదలైన టీమ్‌లు ఎన్నికల నియమావళి, నిబంధనలపై పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. ప్రజలు నిర్భయం గా ఓటుహక్కును వినియోగించుకొనేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనపు పోలీసు బలగాలను పంపుతామని తెలిపారు. రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలకు అవసరం మేరకు పోలీసు బందోబస్తు కల్పిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ దయానిధి, ఎన్నికల అధికారులు మంజులావాణి, గోవిందరాజులు, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, ప్రకాశరావు, అపర్ణ, సునీత, జయంతి పాల్గొన్నారు.

ఉద్యమ నేత చిట్టెమ్మకు ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, మార్చి 18 : మహిళా ఉద్యమనేత, మాజీ సీపీఎం కౌన్సిలర్ పెంటకోట చిట్టెమ్మడు 14వ వర్ధంతి సోమవారం సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఆమె చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చిట్టెమ్మ నిలదీసేవారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం పోరాటం చేశారన్నారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.ప్రభావతి, ఎం.అప్పలరాజు, జి. కోటేశ్వరరావు, డి.వెంకన్న పాల్గొన్నారు.

ఎట్టకేలకు వైసీపీ రంగులు, గుర్తుల తొలగింపు

అనకాపల్లి టౌన్, మార్చి 18: స్థానిక కొట్నివీధిలో ప్రభుత్వ ఆస్తులపై వేసిన వైసీపీ రంగులు, ఫ్యాన్ గుర్తులను ఎట్టకేలకు సోమవారం అధికారులు తొలగించారు. ఎన్నికల నగారా మోగిన 24 గంటలు దాటినా కొట్నివీధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మకు వైసీపీ రంగులు, ఫ్యాన్‌గుర్తు వేయడమే కాకుండా ఆ మార్గంలోని విద్యుత్ స్తంభాలకు వైసీపీ రంగులు వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వార్త ప్రచురితం కావడంతో ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి సోమవారం ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలపై సున్నం వేయించారు. ఫ్లెక్సీలను తొలగించారు.


ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై సున్నం వేసిన దృశ్యం

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

అనకాపల్లి టౌన్, మార్చి 18 : యువత స్వయంకృషితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని స్వావలంబి భారత్ విశాఖపట్నం కన్వీనర్ వెలగ జగన్నాథ్ కోరారు. స్థానిక డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో యువత పారిశ్రామికరంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలున్నాయన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా రాణించాలని కోరారు. స్వావలంబి భారత్ విశాఖపట్నం కో-ఆర్డినేటర్ ముత్యాలనాయుడు మాట్లాడుతూ తాను యువ పారిశ్రామికవేత్తగా ఏ విధంగా ఎదిగానన్నది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్గాల హనుమంతరావు, పి.శ్రీనివాస్, కొణతాల జనార్దన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవిశంకర్ నాయక్



పాయకరావుపేట, మార్చి 18 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.రవిశంకర్ నాయక్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రేమ్‌కుమార్ బదిలీ కావడంతో విజయనగరం జిల్లా నుంచి తాను ప్రమోషన్‌పై వచ్చానన్నారు. కాగా రవిశంకర్ నాయక్ గతంలో ఇదే కళాశాలలో ఆరు సంవత్సరాలు లెక్చరర్‌గా పనిచేశారు.

గోవాడ షుగర్స్‌లో మళ్లీ చోరీ

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీకి ప్రత్యేకంగా సెక్యూరిటీ విభాగం వుంది. అయినప్పటికీ విలువైన సామగ్రి బయటకు పోవడం, చోరీకి గురికావడం వంటివి జరుగుతున్నాయి. అధికారులు సీసీ కెమెరాలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై (సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం) పోలీసు అధికారులు కూడా ఫ్యాక్టరీ అధికారుల తీరును తప్పుబడుతున్నారు. చోరీలు జరిగిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేయడం తప్పితే, దొంగతనాలు జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టకపోవడం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతున్నది.

ఇక షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న చోరీలకు సంబంధించిన కేసులను పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేయకుండా స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగారుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఫ్యాక్టరీలో చోరీలు మరింత పెరుగుతున్నాయని అంటున్నారు. బయట నుంచి వచ్చే దొంగలు, వారికి సహకరించే ఇంటిదొంగలు ఎవరో అధికారులకు తెలిసినా, వారికి స్థానిక నేతల అండదండలు ఉండడంతో చర్యలు తీసుకోలేపోతున్నారని అంటున్నారు.


ఫ్యాక్టరీలో దొంగతనాలు జరిగినప్పుడు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది ప్రమేయం ఉందని తేలినప్పటికీ, వారిపై చర్యల విషయంలో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడం కూడా ఇలాంటి ఘటనలకు ఊతమిస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. ఇటు ఫ్యాక్టరీ అధికారులు, అటు పోలీసులు గట్టి చర్యలు చేపట్టకపోతే ఫ్యాక్టరీలో చోరీలు మరింత పెరిగే ప్రమాదం వుందని కార్మికులు, సభ్య రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం రూ.1.5 లక్షలు


ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 18 : స్థానిక దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ద్వారా 39 రోజులకు రూ.లక్షా 50వేల 773 ఆదాయం ఆలయానికి వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి, ఈవో టి. రాజసులోచన, పర్యవేక్షణ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నియమావళిపై అవగాహన వుండాలి: ఆర్వో


ఎన్నికల నిర్వహణపై చర్చిస్తున్న ఆర్వో గీతాంజలి

నక్కపల్లి, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ నియమావళిపై అవగాహన వుండాలని పాయకరావుపేట ఆర్‌వో కె.గీతాంజలి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ చైనులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టుల తనిఖీ బృందం, వీడియో కవరేజ్ బృందాలు, సెక్టార్, రూట్ ఆఫీసర్లకు ఆమె పలు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల ప్రకటనల బోర్డులను పూర్తిగా తొలగించాల్సి వుందని, అందుకయ్యే ఖర్చు సంబంధిత రాజకీయ పార్టీ పేరుతో నమోదు చేయాల్సి వుంటుందన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచార వాహనాలకు ముందుగా ఆర్వో అనుమతులు వుండాల్సిందేనన్నారు.

పంచదార్లలో భవిష్యత్తుకు గ్యారెంటీ


వృద్ధురాలితో మాట్లాడుతున్న దిన్‌బాబు

రాంబిల్లి, మార్చి 18 : మండలంలోని పంచదార్లలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిందని విమర్శించారు. అన్ని ధరలను పెంచేసి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. రాష్ట్రం బాగు పడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగు తీస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులపర్తిలో బైక్ చోరీ

ఎలమంచిలి, మార్చి 18: మండలంలోని పులపర్తిలో ఈ నెల 12వ తేదీన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని బాధితుడు బి.లోవరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన లోవరాజు తన ద్విచక్ర వాహనాన్ని పులపర్తిలో ఓ చోట పెట్టి కొబ్బరికాయలు తీసుకుని వచ్చేలోపు చోరీకి గురైందని ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

మరిడిమాంబ ఆలయానికి రూ.50వేలు విరాళం

పరవాడ, మార్చి 18 : రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెం మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన సమ్మింగ వెంకటఅప్పారావు చంద్రావతి దంపతులు రూ.50వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, స్థానిక నాయకులు మేడిశెట్టి సోమునాయుడు, పితాని అప్పారావు, దొడ్డి సోమునాయుడు, మేడిశెట్టి గురువునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త రమణకు ఆర్థిక సాయం


రమణకు నగదు అందజేస్తున్న గొంతిన శ్రీనివాసరావు

కశింకోట, మార్చి 18 : తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త త్రిరి రమణకు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన రమణ కొద్ది కాలంగా అనారోగ్యానికి గురయ్యారన్నారు. ఇటీవల కాలికి ఆపరేషన్ చేసుకొని బెడ్‌రెస్టులో ఉన్న రమణకు ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, నాయకులు నైనంశెట్టి రమణారావు, జెర్రిపోతుల నూకునాయుడు, త్రిరి చిరంజీవి పాల్గొన్నారు.

బాలింతలకు పాలు, రొట్టెలు పంపిణీ

అనకాపల్లి టౌన్, మార్చి 18 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయంలోని బాలింతలకు జనపరెడ్డి భవానీ పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ జనపరెడ్డి శ్రీనివాస్‌కృష్ణ సహకారంతో పొట్టి శ్రీరాములు భవనం నిర్వాహకుడు పీఎంఎల్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త కాండ్రేగుల సత్యనారాయణ, గ్రీన్‌క్లబ్ ప్రతినిధి ఆర్.అనిత, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మంజూభార్గవి, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు జంగాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం

ఎలమంచిలి, మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సోమవారం తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం అధికారులంతా నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండకూడదని తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కొండలరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ

రాంబిల్లి, మార్చి 18 : మండలంలోని నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం విజయ వాహిణి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు పోషక విలువల గల ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా వంటలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.మేరీ, బ్లాక్ కోఆర్డినేటర్ సౌజన్యం, పోషణ సఖీ, పి.పద్మ పాల్గొన్నారు.

వెంకన్న కళ్యాణోత్సవాలకు వేళాయె!

▸ నేటి రాత్రి వడ్డాదిలో శ్రీకారం చుట్టనున్న అర్చకులు
▸ ఆరు రోజుల పాటు నిర్వహణ ▸ భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన గిరిజాంబగిరి


ఆలయంలోని స్వామి, అమ్మవార్లు

బుచ్చెయ్యపేట, మార్చి 18 : జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ 151వ వార్షిక కళ్యాణోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభం కానున్నాయి. స్వామి వారి దొంగ పెండ్లితో శ్రీకారం చుట్టనున్నారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆరు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయని దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు తెలిపారు.

ఆలయ చరిత్ర : ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజుల్లో వడ్డాది గిరిజాంబ గిరిపై వెలసిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కళ్యాణోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 154 సంవత్సరాల క్రితం నారాయణ భజే అనే యోగి దేశ సంచారంలో భాగంగా వడ్డాది గ్రామానికి వచ్చినప్పుడు దక్షిణదిశగా ఉన్న గిరిజాంబ గిరి (కొండ)పై వేంకటేశ్వరస్వామి వెలుస్తారని, అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి వెళ్లిపోయినట్టు పెద్దలు చెపుతుంటారు.

స్థల పురాణం : యోగి వెళ్లిన మరసటి సంవత్సరమే వడ్డాది దక్షిణ దిశగా ఉన్న విజయరామ రాజుపేటలో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలు బయటపడ్డాయి. వారు వడ్డాది గ్రామ పెద్ద దొండా భగవంతులయ్యదొరకు ఈ విషాయాన్ని తెలియజేశారు. దీంతో గ్రామస్థుల సహకారంతో విగ్రహాలను గిరిజాంబగిరిపై శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

ప్రాశస్త్యం : వడ్డాది గ్రామంలో దేవస్థానం స్థలానికి మహాభారత కాలంనాటి ఘటనలతో సంబంధం ఉన్నట్టుగా సింహాచలం దేవస్థానం ప్రచురణ ద్వారా తెలుస్తోంది. అజ్ఞాతవాసం సమయంలో పాండవులు గిరిజాంబగిరికి ఆనుకుని ఉన్న చెరువులో స్నానం మాచరించి, సంధ్యావందనం చేసుకోవడంతో ఆ చెరువును పాండవుల చెరువుగా పిలుస్తారు. వడ్డాది-కొత్తూరులో సింహబలుడుమెట్ట పేరుతో నేటికీ ప్రజలు పిలుస్తారు. విరాటరాజు పరిపాలించడం వల్లనే నాటి విరాటపురం నేడు వడ్డాదిగా గుర్తింపు పొందిందని పెద్దలు చెపుతున్నారు. విరాటపురం కొలువులో పనిచేస్తున్న ద్రౌపదిని చూసి మోహించిన సింహబలుడును వడ్డాది-కొత్తూరు మెట్టపై భీముడు వధించడంతోనే ఆ మెట్ట సింహబలుడు మెట్టగా గుర్తింపు పొందిందని స్థానికుల కథనం ధర్మమూర్తులైన పాండవులు సంచరించిన ప్రాంతమైనందున ఈ ప్రాంతమంతా పంటలు సమృద్ధిగా పండుతాయని స్థానికులు విశ్వాసం.

కూటమి ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు తెలిసింది. వీరిలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, మహిళా మోర్చా నాయకురాలు తోట విజయలక్ష్మి, ఈర్లె శ్రీరామ్మూర్తి, డాక్టర్ విక్రమ్, తదితరులు వున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

వేచి చూసే ధోరణిలో వైసీపీ

రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు, 24 పార్లమెంట్ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించామని చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలు.. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేయలేదో చెప్పడంలేదు. ఇటీవల ఇడుపులపాయలో నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించినప్పుడు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి పేరు చెప్పకుండా 'బీసీ' అంటూ దాటవేశారు. దీంతో మళ్లీ తనకు అవకాశం వుంటుందని సిట్టింగ్ ఎంపీ సత్యవతి భావిస్తున్నారు. కానీ ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి లేదా మంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిపై స్పష్టత వచ్చిన తరువాత, సామాజిక సమీకరణలను అనుసరించి తమ అభ్యర్థిని ప్రకటించాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

దక్కని 'దీవెన'

... 5వ పేజీ తరువాయి

ఒకటో తేదీన విడుదల చేసింది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి... మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. యాజమాన్యాల ఒత్తిడి భరించలేక ఇంజనీరింగ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో దాదాపు 50 శాతం మంది ఫీజులను చెల్లించేశారు. కొన్ని యాజమాన్యాలు ఫీజులు చెల్లించేంత వరకూ కాలేజీలకు రావద్దని బహిరంగంగానే చెబుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోక పోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా కొంతమందికి తొలి విడత సొమ్ము కూడా ఇంకా జమ కాలేదు. 20 శాతం మంది విద్యార్థులకు అందాల్సి ఉందని చెబుతున్నారు.

'వసతి దీవెన' నిల్

స్కాలర్‌షిప్ మొత్తాన్ని రెండు విడతల్లో జగనన్న వసతి దీవెన కింద చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో విడత పది వేలు చొప్పున రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ ఒక్క విడత కూడా వసతి దీవెన మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయలేదు. ఇంకా చెప్పాలంటే...గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి వందలాది మందికి వసతి దీవెన నిధులు అందలేదు. అధికారులను అడుగుతున్నా స్పందన లేదని పలువురు చెబుతున్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గతంలో విధానాలను అమలు చేయాలని విద్యార్థులు చెబుతున్నారు.

సమన్వయంతో పనిచేయాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ

... 5వ పేజీ తరువాయి

మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విభాగాల బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో ఉదాసీనంగా వ్యవహరించవద్దని కోరారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి రిపోర్టును ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంసీసీ, ఎంసీఎంసీ, స్టాటిక్ సర్వేలెన్స్ వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ మొదలైన టీమ్‌లు ఎన్నికల నియమావళి, నిబంధనలపై పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకొనేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనపు పోలీసు బలగాలను పంపుతామని తెలిపారు. రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలకు అవసరం మేరకు పోలీసు బందోబస్తు కల్పిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ దయానిధి, ఎన్నికల అధికారులు మంజులావాణి, గోవిందరాజులు, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, ప్రకాశరావు, అపర్ణ, సునీత, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్

▸ ఎక్కడా రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండరాదు ▸ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి
▸ ఎలక్షన్ పూర్తయ్యే వరకు విధులకు హాజరు కావాల్సిందే ▸ సమీక్షా సమావేశాల్లో రిటర్నింగ్ ఆఫీసర్లు ఆదేశం


చీడికాడలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మహేశ్వర్


మాడుగులలో నాలుగు మండలాల అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవి సత్యవాణి



నర్సీపట్నం, చోడవరంలలో జరిగిన సమీక్షా సమావేశాల్లో ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవోలు జయరాం, చిన్నికృష్ణ

చోడవరం, మార్చి 18 : ఎన్నికల సందర్భంగా నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పోలీసులు, రాజకీయపక్షాల నేతలు సహకరించాలని చోడవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఏజీ చిన్నికృష్ణ కోరారు. సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో పోలీసు అధికారులు, రాజకీయపక్షాల ప్రతినిధులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలుతో పాటు, అధికారులు ప్రతి చిన్న అంశంపైనా జాగ్రత్తగా ఉం డాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. అనకా పల్లి డీఎస్పీ అప్పలరాజు, సీఐ బి.శ్రీనివాసరావు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం : ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అన్నారు. సోమవారం ఇక్కడ ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌వోలు, బీఎల్‌వోలు సెక్టార్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల వద్ద రాజకీయ నాయకులకు సంబంధించి హోర్డింగ్‌లు, ఫ్లెక్సీ బ్యానర్లు, ఫొటోలు లేకుండా చూడాలన్నారు. కోడ్‌ను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో జాన్‌లింకన్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి ఆదేశించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున ఈసీ నిబంధనలు అమలు జరుగున్నదీ లేనిదీ పర్యవేక్షించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడంతో పాటు రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఎక్కడా కనిపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మద్యం, డబ్బు పంపిణీ వంటివి జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పార్టీలకు చెందిన నాయకులు బైక్ ర్యాలీలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, వాహనాల ద్వార ప్రచారం తదితరాలకు విధిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు అంతా సమష్టిగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కె.కోటపాడు సీఐ, నాలుగు మండలాల ఎస్‌ఐలు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చీడికాడ : ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మహేశ్వర్ ఆదేశించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యేవరకూ ప్రభుత్వ ఉద్యోగులంతా విధులకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. అధికారులు ఏ సమాచారం పంపించినా వెంటనే స్పందించాలన్నారు. అధికారులు ఫోన్ చేసినప్పుడు గ్రామస్థాయి ఉద్యోగులు స్విచ్ ఆఫ్‌చేస్తే వారిపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ప్రధానంగా ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు, పర్యవేక్షకులు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కిలో చింతపండు రూ.60

▸ కృష్ణాదేవిపేట వారపు సంతలో జోరుగా అమ్మకాలు
▸ గత వారం కంటే ధర రూ.10 పెరుగుదల ▸ ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


సంతకు విక్రయానికి బుట్టలతో తీసుకు వచ్చిన చింతపండు

కృష్ణాదేవిపేట, మార్చి 18 : చింతపండు ధర రోజు రోజుకు పెరుగుతోంది. కృష్ణాదేవిపేట వారపు సంతలో సోమవారం అమ్మకాలు జోరందుకున్నాయి. గతవారం రూ.కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.60 చొప్పున విక్రయాలు జరిగాయి. దీంతో గిట్టుబాటు ధర లభిస్తుందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంతకు అంతాడ, బంగారంపేట, రాజపేట, కొత్తపల్లి, కినపర్తి, ఏఎల్‌పురం, రత్నంపేట తదితర గ్రామాల నుంచి వందలాది కిలోలను బుట్టలతో తెచ్చారు. ఈ ఏడాది చింతపండు దిగుబడి బాగానే ఉంది. దీంతో గిరిజన రైతులు సంకాంత్రి మొదలుకొని వారం వారం ఇక్కడి సంతకు సేకరించి తెస్తున్నారు. ఈ సోమవారం ఇరవై కిలోల బరువు ఉండే చింత పండు బుట్ట రూ.1200, 30కిలో బరువుగల బుట్ట రూ.1,800 పలకడంతో ఆయా రైతులు ముఖాల్లో ఆనందం కనిపించింది. ఇదిలా వుంటే, ఇప్పటికీ చింతపండు కొనుగోళ్లను జీసీసీ ప్రారంభించ లేదు.

రోలుగుంటలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి భూమి పూజ


ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కమిటీ

రోలుగుంట, మార్చి 18 : మండల కేంద్రం రోలుగుంటలో శిథిలావస్థకు చేరిన నూకాంబిక ఆలయాన్ని తొలగించి, కొత్తగా నిర్మాణ చేపట్టేందుకు సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వంద సంవత్సరాల క్రితం ఈ ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం గోడలు బీటలు వారడం, పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గుర్తించిన కమిటీ సభ్యులు మద్దు ఎర్రయ్యమ్మ, బొడ్డు శ్రీనివాస్, కొట్టె రాము, అల్లు శ్రీనివాసరావు, బనికెల దేముడుల ఆధ్వర్యంలో ఆలయన పునర్నిరాణానికి సంకల్పించారు.

85 మందికి కంటి పరీక్షలు

రోలుగుంట, మార్చి 18 : ఇక్కడి పీహెచ్‌సీలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటైన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు 85 మందికి కంటి పరీక్షలు జరిపారు. 35 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం ఎంపిక చేసి ఆస్ప త్రికి తరలించారు. ఆప్తాలమిక్ సురేష్, రామలక్ష్మి, స్థానిక వైద్యాధికారిణి ధనలక్ష్మి, క్యాంపు కో-ఆర్డినేటర్ సీహెచ్.అశ్విని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గవిరెడ్డి'కి మాడుగుల టీడీపీ టిక్కెట్ ఇవ్వాలి'

చీడికాడ, మార్చి 18 : మాడుగుల టీడీపీ అసెంబ్లీ టిక్కెట్‌పై అధిష్ఠానం పునరాలోచన చేసి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఇవ్వాలని పలువురు పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఇక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు మాట్లాడుతూ పైలా ప్రసాదరావు కంటే రామానాయుడుకు టిక్కెట్టు కేటాయిస్తే మంచి మెజార్టీ సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కర్రి నాగమణి, ఎంపీటీసీలు పైలా ముత్యాల నాయుడు, బీళ్ల కోటేశ్వరరావు, దారపు పెద్దినాయుడు, గాడి ప్రసాద్, నాయకులు గండి మునలినాయుడు, పంచాడ దాలెంనాయుడు, సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాగరాజు మృతి


నాగరాజు (ఫైల్)

మాడుగుల రూరల్, మార్చి 18 : మండలంలోని సత్యవరానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్య క్షుడు ఇందుకూరి నాగరాజు (58) అనారోగ్యంతో మృతిచెందారు. ఆది వారం సాయంత్రం ఆయన అస్వస్థతకు గురికావడంతో విశాపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ప్రస్తుతం వైసీపీ నాయకుడిగా ఉన్న నాగరాజు గతంలో రెండు పర్యాయాలు ఎం.కె.వల్లాపురం పీఏసీఎస్ అధ్యక్షులుగా పని చేశారు.

విద్యుత్ షాక్‌కు గురైన ఉద్యోగి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం

దేవరాపల్లి, మార్చి 18 : ఎన్నికల విధుల్లో భాగంగా మండలంలోని ములకలాపల్లిలో ఆదివారం ఫ్లెక్సీలను తొలగిస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన డెక్క చిరంజీవి కుటుంబానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియోను మంజూరు చేశారు. ఈ మేరకు సదరు చెక్కును మృతుడు స్వగ్రామం విజయనగరం జిల్లా వేపాడ మండలం కుంపల్లి వెళ్లి అతని భార్య హేమలతకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ఆనందరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో రాంబాబు, కార్యదర్శి ప్రకాశ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

▸ ఏపీ రైతు సంఘం, ప్రజా సంఘాలు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన
▸ రైతులు లేని సమయాల్లో పలు చోట్ల బిగిస్తున్నారని ఆగ్రహం



విద్యుత్ శాఖ ఏఈకి వినతిని అందిస్తున్న సంఘాల ప్రతినిధులు

కె.కోటపాడు, మార్చి 18 : వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పలురు రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు రైతులు లేని సమయంలో విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని వాపోయారు. స్మార్ట్ మీటర్లు అదానీ కంపెనీ వద్ద నుంచి 600 కోట్ల రూపాయలతో కొనడం జరిగిందని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి యూనిట్‌కు ఎనిమిది రూపాయల పది పైసలు వసూలు చేసి, తిరిగి దానిని రైతులకు నగదు బదిలీ చేస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. గతంలో గ్యాస్ బండకు నగదు బదిలీ చేసి తర్వాత పూర్తిగా దానిని విరమించుకున్నారని, ఇది కూడా ఆ విధంగానే జరుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం ఇటువంటి జిమ్మిక్కులు చేస్తుందని ఆయన ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుంచి సీపీఎం, రైతు సంఘాలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంతా ఈ విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిస్తూ, పాత విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు మోటార్లకు అమర్చారని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకుడు వనము సూర్యనారాయణ, సబ్బవరపు ముత్యాలనాయుడు, వేమల లక్ష్మి, ముర్రు చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


దేవరాపల్లిలో దివ్యాంగ విద్యార్థులను పరీక్షకు తీసుకు వస్తున్న దృశ్యం


కృష్ణాదేవిపేట కేంద్రం వద్ద ఎస్ఐ తనిఖీలు


రావికమతం : పరీక్షకు వేళ్లే ముందు టి.అర్జాపురం వినాయకునికి పూజలు

నర్సీపట్నం, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నర్సీపట్నం రూరల్, అర్బన్ పరిధిలో తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2111 మందికి 26 మంది పరీక్షలకు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఎంఈవో తలుపులు, నాగేంద్ర పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

నర్సీపట్నం అర్బన్ : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పదో తరగతి తొలి పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థులు ఒక్కసారిగా ఆయా కేంద్రాల నుంచి రోడ్డుపైకి రావడంతో శ్రీకన్య థియేటర్ జంక్షన్‌లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. బొడ్డేపల్లి జంక్షన్ నుంచి నర్సీపట్నం వైపు వచ్చే వాహనాలు కిలోమీటరు పొడవున నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ కాంతికుమార్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో సమస్య పరిష్కారమైంది.

చోడవరం : పదో తరగతి పరీక్ష సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఆరు పరీక్షా కేంద్రాల్లో 1149 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, 22మంది అబ్సెంట్ అయినట్టు ఎంఈవో జయలక్ష్మి తెలిపారు.

మాడుగుల/రూరల్ : తొలిరోజు టెన్త్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మాడుగుల కేం ద్రంతో పాటు మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 763మంది హాజరు కావాల్సి ఉండగా, 16మంది గైర్హాజరైనట్టు ఎంఈవో దేముడమ్మ తెలిపారు.

కె.కోటపాడు : మండలంలోని తొలిరోజు టెన్త్ పరీక్షకు 13 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయినట్టు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. మూడు కేంద్రాల్లో పరీక్ష జరగ్గా 558మందికి గాను 545 మంది హాజరైనట్టు చెప్పారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లితో పాటు తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో తొలిరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 443 మంది విద్యార్థులకు ఒకరు ఆబ్సెంట్ అయ్యారు. తెనుగుపూడి కేంద్రంలో ఆరుగురు, దేవరాపల్లి కేంద్రంలో ఒకరు దివ్యాంగులు పరీక్షకు హాజరయ్యారు.తెనుగుపూడిలో పరీక్ష రాయవలసిన విద్యార్థిని, దేవరాపల్లి పరీక్షా కేంద్రానికి వచ్చింది. దీంతో ఆమెను తెనుగుపూడి కేంద్రానికి ద్విచక్ర వాహనంపై మహిళ కానిస్టేబుల్ చంద్రకళ తీసుకు వెళ్లారు. చీఫ్‌లు హైజక్, ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంఈవో పడాల్‌దాస్, ఎస్ఐ డి.నాగేంద్ర పర్యవేక్షించారు.

మాకవరపాలెం : పదో తరగతి తొలిరోజు పరీక్ష మండలంలో ప్రశాంతంగా జరిగింది. మాకవరపాలెం హైస్కూల్, మోంటిస్సోరీ హైస్కూల్, తామరం ఇమ్మాన్యుయేలు పాఠశాలలో మొత్తం 540 మంది పరీక్ష రాయగా, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవోలు తెలిపారు.

చీడికాడ : మండలంలోని టెన్త్ పరీక్షలు మూడు కేంద్రాల్లో ప్రారంభం కాగా, తొలిరోజు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కోనాం కేంద్రంలో 170మందికి 169 మంది, చీడికాడ కేంద్రంలో 139 మందికి 137మంది, మంచాల కేంద్రంలో 184 మందికి అందరూ హాజరైనట్టు ఎంఈవోలు తెలిపారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలో తొలిరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కృష్ణాదేవిపేట హైస్కూల్ కేంద్రంలో 192మందికి 181 మంది హాజరయ్యారు. ఎస్ఐ ఉపేంద్ర, సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపారు. పరీక్ష జరుగుతున్న తీరును చీఫ్ సూపరింటెండెంట్ సుధాకర్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ దరిశి సత్యనారాయణ పర్యవేక్షించారు.

రోలుగుంట : ఇక్కడి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 231 మందికి 219 మంది విద్యార్థులు హాజరైనట్టు చీఫ్ డి.రమేష్ కుమార్, డీవో శేఖర్ తెలిపారు.

రావికమతం : మండలంలో ఐదు కేంద్రాలలో టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రావికమతం హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో 345 మంది, కొత్తకోటలో 193, దొండపూడి హైస్కూల్‌లో 187, మరుపాక మోడ్ స్కూల్‌లో186 మంది హాజరయ్యాయి. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇదిలావుంటే, పరీక్షకు వెళ్లేముందు ఆలయాలను విద్యార్థులు దర్శించుకున్నారు. టి.అర్జాపురం వినాయక ఆలయం ఉదయం సందడిగా మారింది.

గోవాడ షుగర్స్‌లో మళ్లీ చోరీ

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీకి ప్రత్యేకంగా సెక్యూరిటీ విభాగం వుంది. అయినప్పటికీ విలువైన సామాగ్రి బయటకు పోవడం, చోరీకి గురికావడం వంటివి జరుగుతున్నాయి. అధికారులు సీసీ కెమెరాలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై (సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం) పోలీసు అధికారులు కూడా ఫ్యాక్టరీ అధికారుల తీరును తప్పుబడుతున్నారు. చోరీలు జరిగిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేయడం తప్పితే, దొంగతనాలు జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టకపోవడం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతున్నది.

ఇక షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న చోరీలకు సంబంధించిన కేసులను పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేయకుండా స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగారుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఫ్యాక్టరీలో చోరీలు మరింత పెరుగుతున్నాయని అంటున్నారు. బయట నుంచి వచ్చే దొంగలు, వారికి సహకరించే ఇంటిదొంగలు ఎవరో అధికారులకు తెలిసినా, వారికి స్థానిక నేతల అండదండలు ఉండడంతో చర్యలు తీసుకోలేపోతున్నారని అంటున్నారు.

చర్యలు శూన్యం

ఫ్యాక్టరీలో దొంగతనాలు జరిగినప్పుడు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది ప్రమేయం ఉందని తేలినప్పటికీ, వారిపై చర్యల విషయంలో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడం కూడా ఇలాంటి ఘటనలకు ఊతమిస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. ఇటు ఫ్యాక్టరీ అధికారులు, అటు పోలీసులు గట్టి చర్యలు చేపట్టకపోతే ఫ్యాక్టరీలో చోరీలు మరింత పెరిగే ప్రమాదం వుందని కార్మికులు, సభ్య రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.